# స్టార్ డైరెక్టర్

క్లాస్ పిక్చరు తీయాలని కలలుకన్న డైరెక్టరు ఆనందం మూడో పిక్చరు కూడా మాస్ పిక్చరయి కూచుంది. ఇంత నాసిరకం పిక్చరుకి తాను డైరెక్టరని అనిపించుకోవలసి వస్తుందని ఆనందం మొదట్లో ఊహించుకోలేకపోయినాడు. క్లాస్ పిక్చరయితే, డైరెక్టరుకి బాగా పేరు రావచ్చు. ప్రొడ్యూసరు మట్టుకు మట్టికొట్టుకు పోతాడు. ఆనందం ఈ సత్యాన్ని గ్రహించినవాడే. తన కళ్ళ ముందే ఎన్నో ధాఖలాలు కూడా ఉన్నాయి. అందుకే, తాత్కాలికంగా తన కలలన్నీ మూటగట్టి దాచేసి, స్టార్ పిక్చర్స్ ప్రొడ్యూసరుగారి చేతిలో కీలుబొమ్మ కావలసొచ్చింది. పరిస్థితులటువంటివి. డైరెక్టరుకుండే అభిరుచులతో ఏకీభవించి పిక్చరు చూసే జనంకన్నా తమ అభిరుచులకు అనుగుణ్యంగా ఉండే పిక్చర్లకీ డబ్బు పోసే జనం ఎప్పుడూ ఎక్కువగానే ఉంటారు.



డబ్బుకేం? ఎంత చవకబారు పిక్చరయితే అంత ఎక్కువ డబ్బొస్తుంది. ప్రజలక్కావలసిందేమిటి? కొన్ని డాన్సులు-కొన్ని పాటలు, అవి ఏయే సందర్భాలలో వచ్చినా వాటికి ఏమంత పట్టదు. కథ ఎంత గొడవగా ఉంటే అంత మంచిది. కాని, ఆనందంవంటి డైరెక్టరుకి, ఇటువంటి చిత్రం పూర్తిగా తగలడ్డ చిత్రం కిందనే లెక్క.

అయితే, తన చిత్రాలకీ దుర్గతి

పన్యాల రంగనాథరావు

పట్టడం మాట అటుంచి, తన పాతిక సంవత్సరాల ఈడుకే మూడు చిత్రాలను డైరక్టు చేసిన అనుభవం సంపాదించ గలగటమే చెప్పుకోవలసిన సంగతి. చిత్రా లెట్లావున్నా, కనీసం తన స్టార్ సెలక్షనైనా ప్రజల దృష్టిలో పడి ఉంటే, ఆనందం కొంత తృప్తిపడే వాడే.

స్టార్ పిక్చర్స్ ప్రొడ్యూసరు తన్ను డైరక్టరుగా తీసుకుని రెండున్నర సంవత్సరాలయింది. తాను మొదటి చిత్రం తీయబోతున్నప్పుడు మాత్రం ఇంత 'యంగ్ డైరక్టర్' మరొకడులేడని దేశమంతా తనను నెత్తి కెక్కించుకున్న మాట నిజం. అయితే, పిక్చరు బయట పడగానే, ఆ దేశమే ఆ దేశంలో ఉన్న పత్రికలే తనను 'మూడోరకం' చిత్రాల డైరక్టరని తేల్చివేశాయి. యధార్థం కూడా అదే కాని ఈ యధార్థం వెనక దాగివున్న వాస్తవ పరిస్థితులు ఏమయితే ఎవరికొక్క వాలని ఇదే ఆనందం గుండెల్లో చేయిపెట్టి కెలికివేస్తున్నది.

మొదటి చిత్రానికి డబ్బురావటం చూసుకుని అదే ప్రొడ్యూసరు తననే మరో రెండు చిత్రాలు తీయమన్నాడు. ప్రొడ్యూసరు కల్పించిన పరిస్థితులలో పిక్చరు తీయడంకన్నా ఆనందంకి మరొక గత్యంతరం కనపడలేదు. చిత్రం తాలూకు బాగోగులన్నింటికీ అంతిమ జవాబుదారీ డైరక్టర్ గనక, తాను ఎటువంటి పరిస్థితులలో ఆ బొమ్మలు తీయవలసి వస్తున్నదీ ఎవరికీ పట్టే విషయం కాదు.

అయితే ఆనందం అంత మాత్రాన తన జీవితంలో పరాజయాన్ని అంగీకరించే తత్వంగల వాడు కాడు. మూడు చిత్రాలూ మూడోరకానివే అయిపోతా యనుకొని, మూడుసార్లు చిరునవ్వులు నవ్వుకున్నాడు. మూడోసారి చిరునవ్వు నవ్వుకుంటున్న సమయంలో తనకోసం ఎవరో వొచ్చారని తెలుసుకొని, లోనికి రమ్మన్నాడు ఆనందం.


ఎదురుగా శారద!

తన కళ్ళను తానే నమ్మలేక ఒక క్షణంపాటు తేరిపార చూశాడు ఆనందం.

ఆనందం ఆలోచనలు ఎటువంటివో అతనెంత తెలివైనవాడో మొదట్నుంచీ గ్రహించిన శారద గత మూడునాలుగు రోజులుగా అతన్ని కలుసుకునే ప్రయత్నంలోనే ఉంది. ఆ పైన మరి ఉంత బుద్ధి వేయక సూటుకేసుతో సహా తెగించి వచ్చింది.

"నువ్వేనా శారదా! ఎందుకొచ్చావు? నన్నిక చూడటానికి ఎన్నడూ రావద్దని నీతో ప్రత్యేకంగా చెప్పలేదా?" అన్నాడు ఆనందం.

డైరక్టరు ఆనందం తనవైపు చాలా దీనంగా చూడటం భావించలేకపోయింది శారద. సూటుకేసు మెల్లగా కిందపెట్టి ఒకసారి అతని ముఖంలోకి చూసింది.



"ఆఖరిసారిగా, ఒక్కమారు చూసి పోదామని వచ్చాను నా ప్రార్థన కాస్త వింటే-"

ఆమెమాట కడ్డువచ్చా డతను

"ఆ మాటుకే నేమిటి? ఊరి కెళ్తున్నా వన్నమాట మంచిపని చేస్తున్నావు!" అన్నాడు ఆనందం.

"నా ప్రార్థన కాస్త మీరు వినక పోతే, నేను మరి మా వూరు కెళ్ళిపోవడం తప్ప గత్యంతర మేముంటుందీ? సిద్ధపడే వొచ్చాను." అంటూ, సోఫాలో కూర్చున్నది శారద

ఆనందం ఒక సిగరెట్టు తీసి ముట్టించి ఆమెకు కాస్త దూరంగా ఉన్న మరొక కుర్చీలో కూర్చున్నాడు

కిటికీ వైపుగా చూస్తూ, సిగరెట్టు పొగవదులుతున్నాడు ఆనందం, హఠా

త్తుగా శారదవైపు తిరిగి, ఆమెముఖాన్ని తేరిపార చూశాడు

"శారదా, నిన్నిట్లా నేను చూస్తూ ఉంటే, ఉత్తర క్షణంలో ఏం జరుగుతుందో అనేభయం జాస్తీ అవుతున్నది విన్ను నువ్వు కాపాడుకోవా లనుకుంటే, నా దృష్టినుంచి తప్పించుకొని వెంటనే వెళ్ళిపోవటమే మంచిది నా మాట విను–" అన్నాడు ఆనందం.

శారద, ముందు కొద్దిగా ఆశ్చర్యపోయినా, తరువాత, వెంటనే, తను చేసుకొన్న నిశ్చయం జ్ఞాపకాని కొచ్చి, చిరునవ్వు నవ్వుకుంది

"మ రేం కొంపలంటుకుపోవు లెండి నేను చెప్పదలచుకున్న దేదో వినండి," అన్నది శారద.

ఆనందం విస్తుపోయినాడు ఈసారి ఆమెను చూడగానే, మొదట్లో ఆమె ఎంత అందంగా ఉండని తను భావించాడో, అంతకన్న ఇంకా కొన్నిరెట్లు ఎక్కువ అందంగా కనపడ్డది శారద అటువంటి మనిషి, ఈ విధంగా, ఇంత ధైర్యంగా, తన ఎదుట మాట్లాడుతూ ఉంటే, తనకింక నిగ్రహం చాతకాదేమో అనిపించి దతనికి.

"నిన్ను నేను చాలా అన్యాయం చేశాను శారదా! హీరోయిన్ పాత్ర ఇస్తానని చెప్పి, చేతులారా ఎక్స్ట్రా చేశాను. దీనంతటికీ బాధ్యుణ్ణి నేనేలే."

శారద కళ్ళల్లో నీళ్ళు చిమ్మినై. అతను లోలోపల పడుతున్న బాధ తనకు పూర్తిగా అర్థమయిన ట్టయింది.

"బహుశా, జరిగిన విషయాలన్నీ నీకు పూర్తిగా తెలియకపోవచ్చు ఏం? నువ్విట్లా అనుకోవటం లేదా? అన్నాడు ఆనందం

"మీ రట్లా అనుకుంటున్నారు గాని, నా కంతా పూర్తిగా తెలుసు ఇంతకూ, ప్రొడ్యూసరువల్లనే కదా, మీ రేదీ చేయలేకపోయింది! ఆయన తత్వం నాకు బాగా అర్థమయింది. వచ్చిన మర్నాడే గ్రహించగలిగాను. డబ్బుపెట్టే దతను! అతనికి కావలసిన వారిని హీరోయిన్‌గా చేయాలని అతను కాంక్షించటంకూడా సహజమేకదా మరి!!"

ఆనందం ఇంకో సిగరెట్టు తీసి ముట్టిస్తూ, శారద కళ్ళల్లోకి చూశాడు.

"నీలో ఉన్న హీరోయిన్ లక్షణాలు గ్రహించలేనివాడు మా ప్రొడ్యూసర్ ఒక్కడే. గ్రహించినవాణ్ణి నేను ఇప్పుడేందుకూ కొరగాకుండా ఉన్నాను నువ్వింతగా తెలుసుకునీకూడా ఎక్స్ట్రాగా ఎందుకున్నావో నా కర్థంకాకుండా ఉంది!"

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పటం శారదకు చాలా కష్టమయింది నిజానికి తా నక్కడ ఎందుకున్నదీ తనకే తెలీలేదు. తనను హీరోయిన్ చేస్తానని పొంగవేసి తీసుకొచ్చినవాడు ఇతనే! తనలో విశేషమైన ప్రతిభ ఉందంటూ

గ్రహించిన వాడల్లే పొగిడిందీ ఈ డైరక్టరే! అటువంటి ఈ అపందం విధిలేక తనకొక ఎక్‌స్ట్రా వేషం కల్పించవలసి వచ్చింది

అట్లా ఎక్‌స్ట్రా వేషం ఇచ్చేముందు ఆమెతో అన్నాడు కూడా

"నువ్వు మరో స్టూడియోకి వెళ్ళవో, ఇంకే డైరెక్టరునైనా ఆశ్రయించు. హీరోయిన్‌గా తీసుకుందామనుకొని, ఇప్పుడు ఎక్‌స్ట్రాగా నిన్ను నేను నా చేతులారా తీసుకోలేను,'' అని

కాని, తన పాత్రకు బాధ్యురాలు తనే.

శారదను 'డిస్కవర్' చేయటానికి ఆనందం కొన్ని వేల మైళ్ళు ప్రయాణాలు చేశాడు

ఆమెను హీరోయిన్‌చేస్తే, పిక్చరు ఎలా ఉన్నా తన 'డిస్కవరీ' అయినా ఫలించేది! శారదకు హీరోయిన్ పాత్ర ఇవ్వకుండా, ప్రొడ్యూసరు అడ్డుపుల్ల వేసినప్పుడు, తన డైరెక్టరు పదవికి రాజీనామా ఇచ్చేదామనికూడా, అనుకున్నాడు ఆనందం. కాని, ఇంకా కొన్ని చిత్రాలను డైరెక్టుచేసి, ఎప్పటికైనా, క్లాస్ పిక్చర్స్ తీసే డైరెక్టరుగా పేరు ప్రతిష్ఠలు పొందాలనే దీక్ష ఎక్కువయింది తన ప్రతిభ లోకానికి చూపాలనే వెర్రి ఆవేశం కలిగింది.

"ఒక మారుమూలనుంచి, వెతికి వెతికి బయటకు నన్ను తెచ్చినవారు మీరు పేరొచ్చినా పోయినా, మీ చేతిలోనే జరగాలి. నేను దుర్వినియోగ పడననే నమ్మకం నాకు పూర్తిగా ఉంది. ఇప్పు డేమయింది, చూడండి!" అన్నది శారద

నిజమే! ఏమయిందీ? హీరోయిన్ కన్నా, ఎక్‌స్ట్రా వేషం వేసిన శారదకే కొంత పేరొచ్చింది. ఏ పత్రికలో చూసినా శారద గురించి రాసేవాళ్ళే గాని, హీరోయిన్‌మాట తలపెట్టేవాళ్ళే లేరు!

ఇప్పుడు కాకున్నా, మరొకప్పుడైనా, తనకు సినీమా రంగంలో పూర్తి విజయం రాక తప్పదనే ఆత్మవిశ్వాసం తన కెట్లా ఉందో. శారదకూ్కడా అట్లానే ఉండటం గ్రహించి ఆశ్చర్య పడ్డాడు ఆనందం.

''నాలో ఏదో ప్రతిభ ఉన్నట్టుగా మీ రెట్లా గ్రహించాననుకున్నారో, మీ లోని ప్రతిభను నే నొక్కసారిగా అట్లా గ్రహించాను మీకు ఇప్పట్లో ఇక్కడ పరిస్థితులు అనుకూలంగా లేవనికూడా నే నెరగని విషయం కాదు," అన్నది శారద

"నిన్ను మరొక కంపెనీవాళ్ళు పిలిచినట్టు ఈ మధ్యనే విన్నానే! ఆ గొడవేమయింది?" అన్నాడు ఆనందం

ఈ విషయం, ఆనందానికి తెలియక పోవచ్చునని శారద ఎన్నటికీ అనుకోలేదు కాని, అందులో వివరాలేమిటో అతనికి తెలీకపోవచ్చు ఇప్పుడా వివ

రాలుకూడా, చెప్పటమే మంచిదనిపిం చింది శారదకు

"ఆఁ! పిలవటమూ, నేనువెళ్ళటమూ రావటమూ కూడా జరిగాయి'' అన్నది

ఏం జరిగిందన్నట్టుగా తలెత్తి చూశాడామెను ఆనందం

''ఏముందీ? ప్రొడ్యూసరు నన్ను ప్రైవేటుగా కలుసుకోమన్నాడు. వెధవ ఆశ కొద్దీ వెళ్ళాను అతగాడు ఫిల్ము షోగట్టాలూ, కాంట్రాక్టూ, కథా, ఇవన్నీ మాట్లాడుకోవటం మానేసి, నా దగ్గరే ఉండిపో, నీకెక్కువలసినంత డబ్బిస్తాను నిన్ను నా స్టూడియోలకు రాణీగాచేస్తాను అంటూ వాగటం మొదలెట్టాడు 'మీ చిత్రంలో తగిన అవకాశం ఇచ్చి, నన్ను పైకి తెస్తారనే ఆశతో వొచ్చానుగాని, మీ డబ్బు కాశించి, మీకు ఉంపుడుకత్తెగా ఉండటానికి రాలేదు' అంటూ నోటి కొచ్చిన నాలుగూ దులిపేసి, బయట పడ్డాను."

"నువ్వు వెళ్ళిన చోట్లల్లా నీ కటు వంటి అతిథ్యమే ఉంటుందని నాకు బాగా తెలుసు. నీగ్లామరే నిన్నట్లా చేస్తుంది చూడూ! నా కొక భార్య ఉండాలి సంసారం చేసుకోవాలనే ఆశ వొకటి నన్ను పీడిస్తున్నది నువ్వేదో పెద్ద ఆశలు పెట్టుకున్నదానివి దానికి కారణం నే నే అనుకో, అయినా నీ ఆశలూ ఆశయాలూ, కోర్కెలూ, వేరే రకంగా ఉండొచ్చు కాబట్టి, నా నుంచి నువ్వెంత త్వరగా కాపాడుకోగలిగితే అంత సంతో షిస్తాను," అన్నాడు ఆనందం

వెర్రిగా చూసింది శారద – ఆనందం వంక. అత నీ సారి తనను చూడటమే మానేశాడు.

"అంత దుర్భరంగా ఉన్నానా నేను?" అన్నది విస్తుపోయి

''అంత అందంగా ఉన్నావు" నే నేం చెయ్యను?" అన్నాడు ఆనందం

శారద కంతా పూర్తిగా అర్ధమయింది.

"మీరు నా మూలాన చెడిపోయేటంతటి మూర్ఖులు కారు'' అన్నది శారద

ఆనందం మాట్లాడలేదు.


"నేనా విషయం బాగా ఎరుగుదును, మీరు పడుతున్న వేదనకూడా నాకర్థ మయింది మీరింతగా బాధపడటం అనవ సరం. ఇంతకూ, నన్ను తెచ్చి ఈ విధంగా చేశారనేకదూ మీకు విచారం? నామీద మొదట్లో ఇన్ని ఆశలు పెట్టుకున్న మీకు నాచేతనైనన్ని అవకాశాలు కల్పిం చడం నావిధి,"

ఆమె ఇంకా ఏం చెపుతుందో అని ఆదుర్దాగా చూశాడు ఆనందం

"మీపేర కొంత బ్యాంకులో ఉందిగా?"

"ఏమాత్రం? నిండా పాతిక వేలు లేదు – అదైనా, మా తండ్రి పోగానే ఉన్న భూమీపుట్రా అమ్మేసి – ఇల్లు కూడా అమ్మి, నేను చేసిన ఘనకార్యం –"

శారద, తనకు విజయం కలిగినచే



చిరునవ్వు నవ్వింది. తను తెచ్చిన సూటుకేసు మూత తెరిచింది. అందులో ఒక లావుపాటి కంటె, రెండు మురుగులూ, వజ్రాల తమ్మెట్లూ, ముక్కు పుడకల జతా, కాసులపేరూ, నాలుగు జతల చంద్రహారాలూ, ఒక వొడ్డాణం – ఇంకా ఏవో, అన్నీ తేలికైన నగలు – వొక్కసారి బయటకుతీసి, అతని ముందు ఉంచింది

ఆపందం కళ్లు ఒక్కసారి మసగలు కమ్మినై

"ఇదంతా మా అమ్మ సంపాదన. ఏముందీ? శరీరం అమ్ముకుని సంపాదించిన బాపతు చచ్చిపోయేముందు నాకు వప్పగించి పోయింది. ఏం చేయను దీన్ని? మాఅమ్మ పట్టినతో వేపట్టే ఉంటే, ఇంకా ఇంతకన్న ఎక్కువే ఉండేదేమో! వెధవ బతుకు – వెధవ డబ్బు – కాని, నాకొక భర్తఅంటూ ఉండాలనే కోరిక పీకుతున్నది," అన్నది శారద.

ఆమె ధోరణికీ ఆ ఆభరణాలకూ అతను చెవులూ కళ్ళూ వప్పగించి, అట్లా నిశ్చేష్టుడై పోయాడు

"ఈ నగలన్నీ కొన్ని వేలు ఖరీదు చేయవచ్చు మీసొమ్ముతో చేరిస్తే దాదాపు లక్షదాకా కావొచ్చు మీయిష్టం వచ్చినట్టు వినియోగించండి – ఈ సొమ్మంతా మీపరం చేస్తున్నాను,"

అన్నది శారద.

షాక్ తిన్నవాడల్లే కూర్చుని ఉన్న ఆనందం ఒక్కసారి లేచాడు.

"ఇంత డబ్బుంచుకొని నువ్వు చిత్రాల్లో నటించేందు కెందు కొచ్చావు?' అన్నాడు – వెంటనే ఇంకేమనాలి తట్టక.

తీరా ప్రశ్నవేశాక, సమాధాన కూడా, అతనికే తట్టింది అతను తన్ను

సమర్థించుకునే లోపుగానే శారద అందుకుంది.

"వొచ్చాను-అదొక పిచ్చి -మిమ్మల్ని చూడగానే నాకో వెర్రి కోరిక - చిత్రాలలో నటించాలనే కోరిక కలిగింది - అంతకు ముందు నన్ను ఇద్దరు డైరక్టర్లు రమ్మన్నారు. కాని నేను వెళ్ళలేదు, సరికదా, తిట్టి తిట్టి విదలిపెట్టాను. మీరు నన్ను ఎన్నిక చేయటంతోనే నా కోరిక బలీయంగా ప్రబలింది. మీ డైరెక్షను కిందనే పైకిరావాలని _"

"చివరికి ఇట్లా - ఒక పరాయి ఆడదాని సొమ్ముతోనే ..?" అంటూ. ఆనందం అనబోయే లోపునే, శారద అతని దగ్గరగాపోయి, తనచేత్తో అతని నోటిని మూసింది.

"మీకా భేదం లేకుంటే, నే నెంతో సంతోషిస్తాను" అన్నది శారద

ఒకక్షణం అతను మారు మాట్లాడక ఆమెను చూస్తూ కూర్చున్నాడు.

"నేనొక మాటంటాను, నువుమరేం అనుకోవుకదా?" అన్నాడు ఆనందం.

ఏమిటన్నట్టు అతని కళ్ళల్లోకి చూసింది శారద.

"నీ కిష్టమయితే, నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను!"

ఆమాటకోసమే ఎదురుచూస్తున్న వానల్లే వొక్కసారి పొంగిపోయింది శారద.

"హీరోయిన్‌గా నాముందు జీవితంలో మీ కెంత అభివృద్ధి కనపడుతున్నదో, హీరోగా - డైరెక్టరుగా మీ జీవితంలో అంత అభివృద్ధి నా క్కనుపడుతున్నది" అన్నది శారద.

ఇన్నాళ్ళకు మొదటిసారిగా శారదను గట్టిగా కావలించుకో గలిగాడు ఆనందం

వారం రోజుల్లోనే, ఆనందానికి శారదతో, వైభవంగా వివాహం జరిగింది

తనను మూడోరకం పిక్చర్లు తీసే డైరక్టరన్న ప్రజలేకాదు, పత్రికలూ, క్రిటిక్కులూ, సినీ మనుషులూ, అంతా పోగయి, ఇప్పుడు, శారదతోసహా, డైరక్టరు ఆనందాన్ని అభినందించటమే కాకుండా, వీరిద్దరికీ, జీవితంలో గొప్ప 'ఫ్యూచర్' ఉందనికూడా నిర్ణయించారు


"నేను మీతో చెప్పానుకానా, మీలో నిజమైన ప్రతిభ ఉందని! అది లోకం, ఈనాడు పూర్తిగా గ్రహించింది. ఇది మీ విజయానికి మొదటిమెట్టు!" అన్నది శారద

ఆమెను దగ్గరగా తీసుకున్నాడు ఆనందం

"నిన్ను పెళ్ళి చేసుకోవటమే నా ప్రతిభ అంటావా?" అంటూ నవ్వాడు ఆనందం

"కాదా!" అన్నది శారద నవ్వుతూ.

"నా భవిష్యత్తంతా నీ మూలాన్నే నీ మీదుగానే ఉందన్నమాట అందరికీ తెలిసింది నువ్వే నన్ను పెళ్ళిచేసుకోకపోయిఉంటే, వీళ్ళంతా నన్నీవిధంగా



అభినందించే వారేనా? నా వ్యక్తిత్వం ఈ విధంగా నిలపడేదేనా?" అన్నాడు ఆనందం

శారద సిగ్గుతో తల వంచింది "మీరు ఊరికెనే నన్నట్లా అంటున్నారే గాని - ఇంతకూ నాలో ఏం విశేషం ఉంది చెప్పండి?" అన్నది శారద.

"విశేషం ఉంది గనకనే నాతోపాటు లోకమున్నూ గ్రహించింది. ఒక్క చిత్రంలోనైనా హీరోయిన్ వేషం వెయ్యకుండానే, అప్పుడే నువ్వు స్టా వయ్యావుమరి చూశావా?" అన్నా ఆనందం

"అవును ఏ ఒక్క క్లాస్ పిక్చరైనా తీయకుండానే మిమ్మల్ని అందరు గొప్ప డైరెక్టరన్న విధంగానే అంటూ నవ్వింది శారద

"స్టార్ ఓవర్ నైట్!" అన్నా ఆనందం

"సత్యజిత్ రే!" అన్నది శారద.